స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాలి

- అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్



ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగ మల్లేశ్వరి



బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్వామిసత్యనారాయణ

మునగపాక: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. సమన్వయకర్తగా నియమితులైన ఆయన్ను బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ మంచా నాగ మల్లేశ్వరితోపాటు మండల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నేటి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కమిటీలు వేయడం ద్వారా ప్రజలకు చేరువగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. పార్టీ పిలుపు మేరకు ఆందోళనలు తీవ్రతరం చేయాల్సి ఉందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీలు మొల్లేటి కృష్ణవేణి, మళ్ల కాశీ సురేష్, శరగడం అప్పలనరసమ్మ, మద్దాల వీరునాయుడు, ఇల్లా నాగేశ్వరరావు, కాండ్రేగుల వెంకటలక్ష్మి, సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

- చూచుకొండ పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

మునగపాక: ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాలని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి ఆదేశించారు. మండలంలోని చూచుకొండ ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. వ్యాక్సిన్ నిర్వహణ, ల్యాబ్, మందుల గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరమైన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. డాక్టర్ వై.రామకృష్ణ, లక్ష్మీనారాయణ, హెల్త్ ఎక్స్‌టెన్సన్ అధికారి గుర్రం శ్రీనివాసరావు, ఆరోగ్య సూపర్‌వైజర్ బేగం, టెక్నీషియన్ గీత, స్టాఫ్‌నర్స్ జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోషకాహారం శ్రేయస్కరం



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: మహిళలు పోష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడారు. ఆహారం విషయంలో మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. అనంతరం పలు స్క్రీనింగ్ పరీక్షలను వైద్యాధికారి విమలగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పెంటకోట విజయ్, టెక్కలి పరశురామ్, పెంటకోట సత్యనారాయణ, సీహెచ్‌వో దేవకాంత తదితరులు పాల్గొన్నారు.

అమ్మవు నీవే... అఖిల జగాలకు

- నేడు విజయదశమి
- నియోజకవర్గం వ్యాప్తంగా శమీ వృక్ష పూజకు ఏర్పాట్లు



ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞానపీఠంలో అమ్మవారికి పూజలు చేస్తున్న దంపతులు



మహిషాసురమర్దిని అలంకరణలో మునగపాకలో దుర్గాదేవి, యలమంచిలి వాసవీ కన్యకాపరమేశ్వరి



పెంజెరువు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ప్రసాద్‌ను సత్కరిస్తున్న పల్లపు వీధి కమిటీ సభ్యులు

యలమంచిలి రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో మహిళలు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పెంజెరువు కనక దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గాష్టమికి ఏర్పాట్లు చేశామని ఆలయ అనువంశిక ధర్మకర్త కొఠారు వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సమితి ఆఫీసు వీధి ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞానపీఠంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. డాక్టర్ సుతరపు శ్రీకాంత్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాష్టమి రోజున శమీవృక్ష పూజ నిర్వహించడానికి పలుచోట్ల ఏర్పాట్లు చేశారు.

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం భక్తులకు అమ్మవారు మహిషాసురమర్దినిగా అవతారంలో దర్శనమిచ్చారు. మునగపాక పల్లపు వీధి వినాయక ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన దుర్గాదేవి అంబలం పూజ ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మాలపేటకు చెందిన కాండ్రేగుల తేజశ్రీ ఆలపించిన గీతాలు అలరించాయి. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. ఉమ్మలాడలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు భగీరథమ్మ దసరా ఉత్సవాల ముగింపు

అచ్యుతాపురం: జిల్లాలో పేరొందిన హరిపాలెం–అందలాపల్లి భగీరథమ్మ దసరా మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నేడు అగ్నిగుండం, శూలాల మహోత్సవం...

అందలాపల్లి కొండపై అమ్మవారి దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శూలాలు ధరించిన భక్తులు అగ్నిగుండాలు తొక్కుతారు. సాయంత్రం గంగా హారతి నిర్వహించనున్నారు.

కలశాలతో అమ్మవారిని ఊరేగింపు

పాయకరావుపేట: మండలంలో పెదరాంభద్రపురంలో దుర్గాంబిక విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు. 250 మంది భక్తులు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాలతో ఈ కార్యక్రమం ఘనంగా ఊరేగించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు నీలాపు వెంకటరెడ్డి, కట్టా వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భగీరథమ్మ



మునగపాక పల్లపు వీధిలో అంబలం పూజలో భవానీభక్తులు



కలశాలతో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

జనరల్ నోటీసు

మా క్లయింటులు, విశాఖపట్నం అర్బన్, ద్వారకానగర్, ఫోర్త్ లేన్, శ్రీ కన్య విహార్ కాపురస్తులు అయిన (1) కేతవరపు దేముళ్ళు గారి కుమారులు (1) కేతవరపు గురుమూర్తి (2) కేతవరపు గురుమూర్తి గుప్తా గార్లు మాకిచ్చిన భోగట్టాపై యావన్మందికి తెలియజేయునది. ఏమనగా

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తికి (1)అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం ఆవసోమవరం గ్రామ కాపురస్తులు సిరసపల్లి రామారావు గారి కుమారుడు సిరసపల్లి సత్తిబాబు (2)డిటో గ్రామ కాపురస్తులు అయిన మోటూరు సన్యాసిరావు గారి కుమారుడు మోటూరు నాగేశ్వరరావు (3) అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం, యలమంచిలి మున్సిపాలిటీ కాకివాని వీధి కాపురస్తులు మునగపాక చినబ్బాయి గారి కుమారుడు మునగపాక సత్యనారాయణ గార్లు పూర్తి హక్కుదారులు అయివుండి. నిరాటంకముగా అనుభవించుచూ వారి అవసరములు నిమిత్తము అమ్ముజూపగా మా క్లయింటులు షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుటకు సంసిద్ధత వ్యక్తపరచుచున్నందున షెడ్యూల్ ఆస్తి విషయమై ఎవరికి ఎట్టి అభ్యంతరంలు వున్న ఈ తేదీ లగాయితూ 3 దినములు లోగా ఈ దిగువ తెలిపిన అడ్రసుకు వ్రాతమూలముగా తెలియజేయవలెను. అట్లు కాని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్టుగా పరిగణించడమగునని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

అనకాపల్లి జిల్లా, అనకాపల్లి జిల్లా రి॥ యలమంచిలి సబ్ రి॥ యలమంచిలి మండలం రేగుపాలెం రెవెన్యూ గ్రామం తాలూకు గ.జి..మెట్టు సర్వే నెం.290రు భూములు వివరం.
1) యల్.పి.నెంబరు 6494రు తాలుకు య.0-21ట్లు (హె.0.0851)
2) యల్.పి.నెంబరు 6495రు తాలుకు య.0-21ట్లు (హె.0.085)
3) యల్.పి.నెంబరు 1789రు తాలుకు య.0-21ట్లు (హె.0.085)
వెరసి య.0-63ట్లు భూమి ఏకప్రతిగా ఉన్నందున హద్దులు
తూర్పు : కేతవరపు దేముళ్ళు గారి భూమి,
దక్షిణం :రాజాన మాణిక్యాలరావు అలియాస్ చంటి, త్రిమూర్తులు,రాజాన అప్పలనాయుడు వగైరాలు.
పశ్చిమం:కొత్తలి పోవు రోడ్,
ఉత్తరము : రాజాన సత్యనారాయణ వగైరాలు భూమి.

రాజాన గోవిందరావు,
అడ్వకేట్, యలమంచిలి,
Cell No. 9848460118

యలమంచిలి
తేది :30-06-2025

వయోజనులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: అక్షర ఆంధ్రాలో భాగంగా బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వలంటీర్ టీచర్స్‌కు పుస్తకాలు పంపిణీ చేశామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఈ సంవత్సరం నక్కపల్లి మండలంలో వెలుగు డిపార్టుమెంటు ద్వారా రెండు వేల మంది మహిళలకు, ఆర్జీఎస్ డిపార్టుమెంటు ద్వారా 1500 మంది ఉపాధి కూలీలకు చదువు నేర్పించడానికి ప్రతీ పది మంది అభ్యాసకులకు ఒక వలంటీర్ టీచర్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. వారికి ఈ రోజు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో భాగ్యలత పాల్గొన్నారు.

విద్యార్థినులకు సాంకేతిక నైపుణ్య శిక్షణ



ఇంటర్న్‌షిప్ విద్యార్థినులకు శిక్షణ కల్పిస్తున్న ట్రైనర్

అచ్యుతాపురం రూరల్: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా సాంకేతిక నైపుణ్య శిక్షణ పొందారు. పాఠశాల ఐటీ ఉపాధ్యాయిని హేమ ఆదేశాల మేరకు విద్యార్థినులు సాయి నీలిమ, రమ్యదుర్గ, మోహిత, లక్ష్మీప్రసన్న కంప్యూటర్, ఫొటోగ్రాఫ్, ఫొటో డిజైనింగ్, ఇంటర్‌నెట్ అప్లికేషన్స్ వంటి పలు అంశాలపై శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనర్ నరేష్ మాట్లాడుతూ దసరా సెలవులు మొదలుకుని పది రోజుల వ్యవధిలో విద్యార్థినులు టెక్నాలజీతోపాటు వృత్తి నైపుణ్య అభివృద్ధిపై పట్టు సాధించారన్నారు. బుధవారం వీరిని అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సత్కారం



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న మత్స్యకార నాయకులు

ఎస్.రాయవరం: మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మధువర్మ తెలిపారు. బుధవారం అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను మత్స్యకార నాయకులు ఘనంగా సత్కరించారు. మధువర్మ మాట్లాడుతూ మండలంలో కొందరు నాయకులు పార్టీని వీడినప్పటికి గ్రామ స్థాయిలో నాయకత్వం చెక్కు చెదరలేదన్నారు. త్వరలో గ్రామ కమిటీ నియమించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేయని పథకాలుపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యక్షులు వెదుళ్ల బంగారి, మైలపల్లి రాజారావులను సత్కరించారు. వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

పాయకరావుపేట: పట్టణంలో చిత్రమందిర్ థియేటర్ సెంటర్ వద్ద మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ విగ్రహం ధ్వంసంపై పీసీసీ కార్యదర్శి బి.యేసయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తహసీల్దార్‌కూ ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.